క్లుప్తంగా

ప్రజలకు అవగాహన కల్పించండి

నంద్యాల(సిటీ): పట్టణంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సూచించారు. గురువారం స్థానిక 23వ వార్డును సందర్శించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణతో చేకూరే లబ్ధిని ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు పథకాలకు అవసరమయ్యే ధ్రువ పత్రాలను ఈ కార్యక్రమంతో పొందవచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ వెంట మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక


కావ్యశ్రీ

ఉయ్యాలవాడ : స్థానిక మోడల్ స్కూల్‌లో గతేడాది 10వ తరగతి చదివిన కావ్యశ్రీ వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైందని ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో మండలంలోని ఇంజేడు గ్రామానికి చెందిన కావ్యశ్రీ 561 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు. ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా ఎంపికైందని చెప్పారు. విద్యార్థినిని అధ్యాపకులతో కలిసి అభినందించారు.

జగజ్జననీ మాతకు సారె


అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(సిటీ): స్థానిక జగజ్జననీ దేవాలయంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని గురువారం భక్తులు అమ్మవారికి ఆషాడం సారెను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు అమ్మవారి ప్రతిమను అలంకరించి మేళతాళలతో పురవీధుల్లో ఊరేగించి ఆలయానికి చేరుకొని సారె సమర్పించారు.

పశుగణాభివృద్ధికి తోడ్పడండి


మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

నంద్యాల (సెంట్రల్): ప్రతి రైతు తన పొలంలో పది శాతం పశుగ్రాసానికి కేటాయించి పశుగణాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా పశుసంవర్థక శాఖాధికారి వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. గురువారం నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాలలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సాంకేతిక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని రైతుభరోసా కేంద్రాల్లో 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు కేవీ బ్రహ్మం, శ్రీనివాసులు, శస్త్ర చికిత్స సహాయకులు శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

బొమ్మలసత్రం: రోడ్డు ప్రమాదాలను నివారించడానికి జిల్లాలో అన్నీ పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రతి రోజూ మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడిపితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవన్నారు.

నర్సరీలో రిజిష్టర్లు నిర్వహించాలి

చాగలమర్రి: నిర్వాహకులు నర్సరీకి సంబంధించి మొక్కల కొనుగోలు, అమ్మకం రిజిష్టరును తప్పనిసరిగా నిర్వహించాలని ఆళ్లగడ్డ డివిజన్ హార్టికల్చర్ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని నర్సరీలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక 3వ రైతు భరోసా కేంద్రంలో వాటి యజమానులతో సమావేశం నిర్వహించారు.

వలంటీర్లకు అభినందన


వలంటీర్లను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చాగలమర్రి: 5–18 సంవత్సరాల వయస్సు పిల్లలు బడుల్లో ఉన్నారా లేదా అని ప్రభుత్వం మండలంలో జీఈఆర్ సర్వే నిర్వహించింది. సర్వేలో స్థానిక 1వ సచివాలయ పరిధిలోని వలంటీర్లు లింగమ్మ, సాద్ అలీ, 5వ సచివాలయ పరిధిలో నరసింహులు వంద శాతం బాలలు బడుల్లో ఉన్నట్లు గుర్తించి సర్వే నివేదికలు ఇవ్వడంతో వారికి విద్యాశాఖ తరఫున ఎల్లో బ్యాడ్జ్ గుర్తింపు ఇచ్చిందని ఎంఈఓ న్యామతుల్లా గురువారం తెలిపారు. దీంతో నాయకులు, అధికారులు వలంటీర్లను అభినందించారు.

రాజకీయాలకు అతీతంగా పథకాల వర్తింపు


పథకాల గురించి మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

గోస్పాడు: కుల, మత, రాజకీయాలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చింతకుంట్ల గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేసి పథకాల అమలుపై ఆరా తీశారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీలను 96శాతం నెరవేర్చిన ఏకైక సీఎంగా జగనన్న చరిత్ర సృష్టించారని కొనియాడారు. గ్రామాల్లో కేవలం అర్హత ఆధారంగా పథకాలు అందజేస్తున్నారని, తమకు ఓటు వేయకపోయినా లబ్ధిదారులుగా మార్చామని, దీన్ని ప్రజలు గుర్తించాలని కోరారు. రాజకీయం కోసమే అయితే టీడీపీ వారి లాగా కేవలం పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇచ్చుకునేవారని, కానీ జగనన్న ప్రజల కోసం పనిచేస్తారని, తండ్రి వైఎస్సార్ కంటే మిన్నగా సంక్షేమ పథకాలు అందజేసి అందరి మన్ననలు అందుకుంటున్నారని చెప్పారు. పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి జగనన్నను సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధికారులు, మండల సచివాలయ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, వైస్ ఎంపీపీ జనార్దన్ రెడ్డి, సర్పంచ్ మల్లేశ్వరి, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, యాసం రామ సుబ్బారెడ్డి ,పార్థసారధి రెడ్డి, ఆమీదేల నారాయణ, సుధాకర్ రెడ్డి, చంద్ర మౌళిశ్వర్ రెడ్డి,శివకిరణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా,పీపీ నాగిరెడ్డి

గోస్పాడు: జిల్లెల్ల గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ మృతి చెందడంతో ఆయన కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5.15 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును భార్య సువర్ణకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, రాష్ట్ర మార్కఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి గురువారం అందజేశారు. ఉపాధి హామీ పథకంలో మోహన్ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తూ కొంతకాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వము ఎక్స్ గ్రేషియా మంజూరు చేసింది. ఏపీఓ నాగజ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు నాగ జ్యోతీశ్వర రెడ్డి, ఉపాధ్యక్షుడు బాలన్న పాల్గొన్నారు.

ఆస్పత్రికి వచ్చి పింఛన్ ఇచ్చాడు


ప్రొద్దుటూరుకు వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుధాకర్

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఈ వృద్ధురాలు చాగలమర్రి మండలం ఆవులపల్లె గ్రామానికి చెందిన మేరబోయిన సంటెమ్మ. ఈమెకు నా అనేవారు లేకపోవడంతో పింఛనే జీవనాధారంగా జీవిస్తోంది. అయితే వృద్ధాప్యం కావడంతో అనారోగ్యంతో సరిగా నడవలేక, కళ్లు కూడా కనపించక పోవడంతో ఈ ఏడాది మార్చిలో ప్రొద్దుటూరులోని ఆసుపత్రిలో చేరింది. రెండు నెలలు అక్కడే ఉండాల్సి వచ్చింది. ఆ సయంలో వలంటీర్ సుధాకర్ రెండు నెలలు వరుసగా ప్రొద్దుటూరులోని ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేశాడు. – ఆళ్లగడ్డ

రూపాయి కూడా ఆశించలేదు



నేను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పుడు ఇక్కడికే వచ్చి మా వలంటీర్ సుధాకర్ పింఛన్ ఇచ్చాడు. ఆ సమయంలో వంద రూపాయలు ఇవ్వడానికి వెళ్తే వద్దవ్వా అనేవాడు. ఇప్పటి కాలంలో డబ్బులు లేకుండా ఎవరు పనిచేస్తున్నారు. మా సుధాకర్ మాత్రం ఇప్పటికీ ఇంటికీ వచ్చి అవ్వా ఆరోగ్యం ఎలా ఉంది అని ఆరా తీసి పింఛన్ ఇచ్చి వెళ్తున్నాడు. ఆ దేవుడు ఆయనను బాగా చూడాలి.

– మేరబోయిన సంటెమ్మ, ఆవులపల్లె

విద్యార్థినికి అభినందనలు

రుద్రవరం: ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన వెంకటతులసిని గురువారం రుద్రవరం ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు. తువ్వపల్లెకు చెందిన విద్యార్థిని మోడల్ పాఠశాలలో పదవతరగతి చదివి మంచి మార్కులు సాధించింది. ఒంగోలు క్యాంపస్‌లో అదే ప్రతిభ చూపి మొదటి ప్రయత్నంలోనే ట్రిపుల్ ఐటీ సీటు సాధించిందని చెప్పారు.

అర్హులకు పథకాలు అందజేయడానికే 'జగనన్న సురక్ష'


ధ్రువ పత్రాలను అందజేస్తున్న పీపీ నాగిరెడ్డి, అధికారులు,


రైతుకు కౌలుకార్డును అందజేస్తున్న అధికారులు,


ఆర్.జంబులదిన్నెలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

గోస్పాడు: ఇంకా ఎవరైనా అర్హులై ఉండి పథకాలు అందకపోయి ఉంటే వారిని కూడా లబ్ధిదారులుగా మార్చాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీనాగిరెడ్డి అన్నారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో గురువారం మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి అధికారులు వచ్చి ఉచితంగా అవసరమైన ధ్రువ పత్రాలు అందజేస్తున్నారని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో వీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడ్డారో అందరికీ తెలిసిందేనని, ప్రస్తుతం ఇంటికే వచ్చి ఇస్తున్నారని చెప్పారు. గ్రామంలో మొత్తం 592 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. వీటిలో కులధ్రువ పత్రాల కోసం 284 దరఖాస్తులు, ఆదాయ ధ్రువ పత్రాల కోసం 282 దరఖాస్తులు, రేషన్ కార్డులో మెంబర్ అడిషన్, ఆరోగ్యశ్రీ, తదితర వాటికి 26 దరఖాస్తులు అందాయని వివరించారు. వీటన్నింటన్నీ ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్, డీటీ రామచంద్రారావు అక్కడికక్కడే 592 ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. ఎంపీపీ ఆర్థర్ సైమాన్, వైస్ ఎంపీపీ జనార్ధన్ రెడ్డి, సర్పంచ్ శివమ్మ, ఎంపీటీసీ పూర్ణ చౌడేశ్వరి పాల్గొన్నారు.

దొర్నిపాడు: సంక్షేమ పథకాలకు అర్హత పొందాలంటే ధ్రువపత్రాలు ఎంతో కీలకం అని తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామంలో సర్పంచ్ అభిలాష్‌రెడ్డి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 310 మందికి 11 రకాల పత్రాలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఓ సునీత, డాక్టర్ భార్గవి, ఆర్‌డబ్ల్యూ ఎస్ఏఈ సుప్రియ, మండల రిసోర్స్ కో ఆర్డినేటర్ జర్మియా, పంచాయతీ కార్యదర్శులు నాగార్జున, మధు, వీఆర్ఓ ప్రవీణ్ పాల్గొన్నారు.

చాగలమర్రి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా 11 రకాల ధ్రువ పత్రాలు పొందవచ్చని ఉపసర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్ అన్నారు. స్థానిక 5వ సచివాలయ కార్యాలయ ఆవరణలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సర్పంచ్ తులసమ్మ, ఉప సర్పంచ్ పాల్గొన్నారు. సచివాలయ పరిధిలోని 17,18,19,20 వార్డుల్లో 373 దరఖాస్తులు అందగా 369 మందికి ధ్రువ పత్రాలు అందజేసినట్లు ఎంపీడీఓ మహబూబ్‌దౌలా తెలిపారు.

ఉయ్యాలవాడ : అర్హులను గుర్తించి పథకాలు అందజేసేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. గురువారం మండలంలోని ఆర్.జంబులదిన్నె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు బాలిరెడ్డి, ఉప సర్పంచ్ లక్ష్మీకాంత రెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజలకు అవసరమైన వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. సర్వేలో 81 మందికి టోకెన్లు జారీ చేయగా వారందరికీ ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు సరాబు దస్తగిరి, గిరిధర్, పంచాయతీ కార్యదర్శి దీప్తి, డిజిటల్ అసిస్టెంటు మౌలాలి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష బృహత్ కార్యక్రమం


ధ్రువ పత్రాలను అందచేస్తున్న డీఎల్‌డీఓ

శిరివెళ్ల: జగనన్న సురక్ష కార్యక్రమం బృహత్ కార్యక్రమని డీఎల్‌డీఓ జనార్ధనరావు అన్నారు. గురువారం బోయలకుంట్లలో సర్పంచు జింకల నాగన్న అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 756 మందికి ధ్రువ పత్రాలను పంపిణీ చేశారు. కో– ఆప్షన్ మెంబర్ జిలానీ బాషా, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, జగనన్న సురక్ష టాస్క్ ఫోర్స్ మెంబర్ రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక 2వ గ్రామ సచివాలయం పరిధిలో గురువారం గ్రామ సర్పంచు బైరి విజయలక్ష్మి అధ్యక్షతన తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా 229 మందికి ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. ఏఈలు వెంకరాముడు ,ప్రమోద్, ఏఓ శ్రీకృష్ణ పాల్గొన్నారు.

వర్షం.. హర్షం


డబ్ల్యూ.గోవిందిన్నె వద్ద కళకళలాడుతున్న మినుము పైరు

దొర్నిపాడు: మండలంలో బుధవారం రాత్రి మోతాదు వర్షం కురువడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ.కొత్తపల్లె, చాకరాజువేముల, బుర్రారెడ్డి పల్లె, క్రిష్టిపాడు, దొర్నిపాడు గ్రామాల్లో వర్షం కురిసింది. కాగా..తొలకరి వానలకు రైతులు విస్తారంగా మినుము పంటను సాగు చేశారు. గత వారం రోజులుగా ఆశించినంత వర్షం లేక పోవడంతో వాడుతున్న పంటను చూడలేక రైతన్నలు మేఘాల వైపుగా ఆశగా చూసేవారు. ఎట్టకేలకు రాత్రి కురిసిన వర్షవ వారికి ఊరటనిచ్చింది. అదునైన వర్షాలు కురిస్తేనే మిగిలిన పంటలు సాగువుతాయని, అలాగే సాగు చేసిన పంటలకు కూడా ఇబ్బందులు ఉండవని వారు చెబుతున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషిచేద్దాం


మాట్లాడుతున్న నిర్మల

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరిస్తూ వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ పీడీ నిర్మల పిలుపునిచ్చారు. బాల్య వివాహాలను నిర్మూలించి బాలికలకు బంగారు భవిష్యత్తునిద్దామని కోరారు. స్థానిక రామకృష్ణా పీజీ కళాశాల ఆడిటోరియంలో గురువారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్, ఎస్‌బీసీసీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే తమ దృష్టికి తేవాలన్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నాడు సాంఘిక దురాచారాలు, ఆర్థిక అసమానతల కారణంగా బాల్య వివాహాలు జరిగేవని, నేడు అలాంటి పరిస్థితులు లేవన్నారు. అక్కడక్కడా జరిగే బాల్య వివాహాలను అడ్డుకుని వాటి అనర్థాలను తల్లిదండ్రులకు వివరించాల్సి బాధ్యత స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలపై ఉందన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, సీడీపీఓ చంద్రకళ, తిరుపతి రావు, పద్మావతి, విజయ్‌కుమార్, రమనమ్మ రామారావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అభినందన


ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందిస్తున్న డీఎం గంగాధర్ రావు

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల డిపోలో ఈ ఏడాది జూన్‌లో ప్రతిభ చూపిన డ్రైవర్లు, కండక్టర్లకు డిపో మేనేజర్ గంగాధర్ రావు గురువారం డిపో ఆవరణలో అభినందించారు. ఆదర్శ ఉద్యోగుల అభినందన సభను ఏర్పాటు చేసి అత్యధిక ఆదాయం తెచ్చిన కండక్టర్లకు, డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు, ప్రోత్సాహకాలను అందజేశారు. కండక్టర్లు హనీఫ్, రాయుడు, రమణ, దస్తగిరి, మోహిద్దీన్, డ్రైవర్లు నాగన్న, అహ్మద్, సామన్న, వలి, రావు తదితరులను సన్మానించారు. అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు, ఇంజనీర్ విజయకుమార్ పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ


ఆలయాన్ని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

శిరివెళ్ల: వెంకటాపురం గ్రామంలోని శివాలయంలో చోరీ జరిగింది. ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి దాటాక కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారం తలుపులు పగలగొట్టి, ఆలయంలోని సీసీ కెమెరా పని చేయకుండా కెమెరా వైర్‌ను కట్ చేసి దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయ గర్భగుడిలో ప్రవేశించి స్వామి వారి వెండి నాగాభరణం, అమ్మవారి వెండి కమ్మలు, 4 ఇత్తడి గరిటెలు, ఇత్తడి బిందెలు ఎత్తుకెళ్లారు. కాగా.. యథావిధిగా ఆలయ పూజారి కుమార్ శర్మ పూజల నిమిత్తం గురువారం ఉదయం ఆలయానికి వెళ్లగ తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళనతో ఆలయ ధర్మకర్తలకు సమాచారం ఇచ్చారు. వారి సమాచారం మేరకు సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ సురేష్ అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆనవాళ్ల కోసం కర్నూల్ నుంచి క్లూస్ టీంను రప్పించారు. వారు బీరువాపై ఉన్న చేతి ముద్రలను సేకరించారు. చోరీలో రూ.55 వేలు విలువైన ఆభరణాలు ఎత్తుకెళ్లారని ఎస్ఐ తెలిపారు. సర్పంచు కందుల ప్రసాదరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని చెప్పారు.

నూనెపల్లె దారిని కొనసాగించాలి

నంద్యాల(అర్బన్): నూనెపల్లె బ్రిడ్జి కింద ఉన్న రైల్వే ట్రాక్ దారిని యథాతదంగా ఉంచాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య అధికార ప్రతినిధి ఊకొట్టు వాసులు డిమాండ్ చేశారు. నిత్యం వేలాది మంది తిరిగే దారిని రైల్వే అధికారులు మూసివేయడాన్ని నిరసిస్తూ గురువారం స్థానికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. నాయకులు ఎస్‌వైడీ ప్రసాద్, సలాం, అనందరావు పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు స్పందన

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామ సచివాలయంలో గురువారం నిర్వహించిన ఆధార్ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆధార్ కార్డులో జిల్లా మార్పు, ఫోన్ నంబర్ లింక్ చేయించుకునేందుకు గ్రామస్తులు తరలివచ్చారు. చాలా మందికి కర్నూలు జిల్లా అని అధార్‌లో ఉండటంతో ప్రభుత్వ పథకాల అమలుకు నంద్యాల జిల్లా మార్చుకోవాలని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో ఎంపీడీఓ సుబ్బారెడ్డి స్థానిక సచివాలయంలో నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: మండలంలోని మర్రిపల్లె గ్రామానికి చెందిన సురేష్ (36) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని రూరల్ ఎస్ఐ నరసింహులు తెలిపారు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన సురేష్.. బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించామన్నారు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి

నంద్యాలటౌన్: వర్షాకాలం కావడం వల్ల సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, విద్యార్థులకు వ్యాధులు రాకుండా వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ తెలిపారు. గురువారం కొత్తపల్లె గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.